సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



మద్యానికి దూరం..చారిగాం

చారిగాం.. మారుమూల గ్రామమైనా ఆదర్శంగా నిలుస్తోంది. మద్యపానంపై నిషేధం విధిస్తూ మూడున్నర దశాబ్దాల క్రితం పెద్దలు చేసిన తీర్మానం నేటికీ అమలవుతోంది. IIలో▸



అధిక తేమతో పంటలకు చేటు

వర్షాలకు పంటల్లో నీరు నిలుస్తోంది. నీరు ఎక్కువై తేమ ఏర్పడితే పంటలకు నష్టం వాటిల్లుతుందని, తక్షణమే జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. IIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0 /25.0

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. ఆకాశం మబ్బు పట్టి ఉంటుంది.

న్యూస్‌రీల్

స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

మంచిర్యాలఅగ్రికల్చర్: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు కలెక్టరేట్‌తోపాటు మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు గురువారం ముస్తాబయ్యాయి. కలెక్టరేట్ ఆవరణలో టెంట్లు, శామియానాలు, అతిథులకు కుర్చీలు తదితర ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాతీయ పతాకావిష్కరణ, వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల అమలు తెలియజేసే స్టాళ్ల ఏర్పాటు, ముఖ్య అతిథి ప్రసంగం, సాంస్కృతి కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఉదయం 9గంటల నుంచి 11.30గంటల వరకు గౌరవ వందనం సమర్పణ, ప్రగతి నివేదిక సందేశం, ప్రశంసాపత్రాల పంపిణీ తదితర కార్యక్రమాలు ఉంటాయి.

జిల్లా నుంచి మంత్రి ఉన్నా..

జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండగా.. గతంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండావిష్కరణకు ప్రభుత్వ సలహాదారుకు సర్కారు అవకాశం కల్పించింది. ప్రస్తుతం జిల్లా నుంచి రాష్ట్ర మంత్రిగా గడ్డం వివేక్‌వెంకటస్వామి ఉన్నారు. అయినప్పటికీ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో జెండా ఎగురువేసే అవకాశం ఇతర ప్రాంతానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావుకు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు చెందిన మంత్రికి అవకాశం కల్పించకపోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ ఆగుతుంది..



బెల్లంపల్లిలో హాల్టింగ్ చూపిస్తున్న పోర్టల్

సాక్షి ఎఫెక్ట్..

బెల్లంపల్లి: మంచిర్యాల, బెల్లంపల్లి రైల్వేస్టేషన్లలో ఏపీ సంపర్క్‌క్రాంతి ట్రైవీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదలకు రైల్వే అధికారులు ఎట్టకేలకు సానుకూలత వ్యక్తం చేశారు. ఈ నెల 2న 'సాక్షి'లో 'రైళ్లు ఆగవా..' శీర్షికన ప్రచురితమైన కథనంలో ఆయా స్టేషన్లలో హాల్టింగ్ ఎత్తివేసిన వైనాన్ని ప్రస్తావించడం తెలిసిందే. స్పందించిన రైల్వే అధికారులు హజ్రత్ నిజాముద్దీన్(న్యూఢిల్లీ) నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతికి వెళ్లే ఏపీ సంపర్క్‌క్రాంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును దిగువ మార్గంలో ఆయా రైల్వేస్టేషన్లలో నిలుపుదలను పునరుద్ధరిస్తూ రైల్వే రిజర్వేషన్ పోర్టల్ ఐఆర్‌సీటీసీలో అప్‌డేట్ చేశారు. ఈ నెల 21 నుంచి నిలుపుదలకు పొందుపర్చారు. రైల్వే ప్రయాణికుల సమస్యలు, రైళ్ల హాల్టింగ్ ఎత్తివేతపై రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తోడ్పడిన 'సాక్షి'కి, రైల్వే ఉన్నతాధికారులకు ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం అధ్యక్షుడు ఫణి, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.


అవినీతే సమస్య..!


- అందరికీ దక్కని స్వేచ్ఛ–సమానత్వం
- చట్టసభలు, అధికార యంత్రాంగం నిజాయతీగా పని చేయాలి
- అప్పుడే అందరికీ స్వాతంత్య్ర ఫలాలు
- 78ఏళ్ల స్వాతంత్య్ర భారతంపై ప్రజల మనోగతం
- 'సాక్షి' సర్వేలో వెల్లడి

భారతావని స్వాతంత్య్రం సాధించి 78 వసంతాలు పూర్తి చేసుకుని 79వ సంవత్సరంలోకి ప్రవేశిస్తోంది. స్వతంత్ర భారత్ అనేక రంగాల్లో తనదైన ముద్ర వేస్తూ అభివృద్ధి వైపు దూసుకెళ్తోంది. శాస్త్రసాంకేతిక రంగాల నుంచి అంతరిక్షం వరకు ఎన్నో విజయాలు సాధిస్తోంది. స్వతంత్ర భారతంలో ఇన్నేళ్లలో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య, స్వేచ్ఛ–సమానత్వం, నిజాయతీగా పని చేయాల్సిన రంగాలపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని యువత, మహిళలు, పురుషులు 140 మందిని 'సాక్షి' సర్వే చేసింది. ప్రస్తుత సమాజంలో అవినీతి ప్రధాన సమస్యగా మారిందనే అభిప్రాయం వ్యక్తమైంది. అందరికీ స్వేచ్ఛ–సమానత్వం లభించడం లేదని స్పష్టం చేశారు. స్వాతంత్య్ర ఫలాలు అందరికీ దక్కాలంటే చట్టసభలు, అధికారయంత్రాంగం మరింత నీతి, నిజాయతీగా పని చేయాలని సమాధానం ఇచ్చారు.

– కాగజ్‌నగర్‌టౌన్/నిర్మల్‌ఖిల్లా/మంచిర్యాలటౌన్/ఆదిలాబాద్







శాసించే స్థాయిలో భారత్..!

- 2047 నాటికి ప్రపంచంలోనే నంబర్ వన్
- టెక్నాలజీ, అభివృద్ధి, విద్య, వైద్యరంగాల్లోనూ ఘనత
- వందేళ్ల భారతంలో అభివృద్ధిపై యువత అభిప్రాయం
- వందేళ్ల భారత్ ఎలా ఉండాలి అనే అంశంపై 'సాక్షి' టాక్ షో



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన టాక్ షోలో పాల్గొన్న డిగ్రీ విద్యార్థులు

మంచిర్యాలటౌన్: భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చి 2047నాటికి వందేళ్లు పూర్తవనుండగా.. ఆ నాటికి మన దేశం ప్రపంచాన్ని శాసించే స్థాయిలో అన్ని రంగాల్లోనూ నంబర్ వన్ స్థానంలో ఉంటుందని యువత అభిప్రాయ పడింది. శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 'వందేళ్ల భారతం ఎలా ఉండాలి' అనే అంశంపై 'సాక్షి' గురువారం మంచిర్యాలలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో టాక్‌షో నిర్వహించింది. కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉపేందర్‌రెడ్డి, డిగ్రీ విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. దేశానికి ఏదో చేయాలనే తపనతో విద్యార్థులు, యువత ముందుకు వచ్చే అవకాశం ఉందని, వందేళ్లలో దేశ పురోగాభివృద్ధి బాగుంటుందని, ప్రపంచాన్ని శాసించే సూపర్‌పవర్‌గా భారత్ ఎదుగుతుందని అభిప్రాయపడ్డారు. దేశానికి యువతసే వెన్నెముక, ప్రభుత్వం సరైన అవకాశాలు కల్పిస్తే దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తారని స్పష్టం చేశారు. చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలను నెలకొల్పేందుకు ప్రభుత్వం యువతకు పూర్తి సహకారం అందించడంతోపాటు ఉపాధి అవకాశాలను పెంపొందిస్తేనే దేశాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇంచార్జి రాజు, పీడీ నూనె శ్రీనివాస్, లెక్చరర్లు మహేశ్, చంద్రశేఖర్, సుమలత, శ్వేత, సుధాకర్, గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థలో మార్పు రావాలి



న్యాయవ్యవస్థలో న్యాయం జరిగేందుకు ఏళ్లుగా బాధితులు ఎదురు చూడాల్సి వస్తోంది. వీలైనంత త్వరగా బాధితులకు న్యాయం జరిగేలా మార్పులు రావాలి. దేశం ఇప్పటికీ టెక్నాలజీలో దూసుకుపోతూ ఎన్నో రకాల రీసెర్చ్‌లకు కేంద్ర బిందువుగా మారుతోంది. టెక్నాలజీలో యువతకు మంచి అవకాశాలు కల్పించాలి.

– దానిష్ మినహాజ్, బీఎస్సీ సెకండియర్, మంచిర్యాల

టెక్నాలజీలో మరింతగా రాణించాలి



భారతదేశం టెక్నాలజీలో ఎంతగానో ఎదిగింది. ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే టెక్నాలజీలో మరింతగా రాణించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం ఏఐ టెక్నాలజీ వంటి వాటిలో యువత రాణించేలా చూస్తే మన దేశాన్ని వారే అభివృద్ధి పథంలో తీసుకెళ్తారు.

– కే.సాయివిగ్నేష్, బీబీఏ సెకండియర్, మంచిర్యాల

యూనిటీతోనే దేశాభివృద్ధి



దేశానికి స్వాతంత్య్రం కోసం ముత్తాతలు పోరాడి సాధించి ఇచ్చారు. మనమంతా యూనిటీగా ఉంటే దేన్నయినా సాధించవచ్చని 1947లోనే మన పూర్వీకులు స్వాతంత్య్రాన్ని సాధించి నిరూపించారు. ప్రస్తుతం వందేళ్లలో మన దేశం ప్రపంచంలోనే మొదటిస్థానానికి వెళ్లాలంటే అదే యూనిటీతో దేశాభివృద్ధిలో ప్రతీ ఒక్కరి పాత్ర ఉండాలి.

సిహెచ్.మహేశ్వరి, ఎంఎస్‌టీడీఎస్ సెకండియర్, లక్సెట్టిపేట

విద్య, వైద్యం అందాలి



దేశానికి స్వాతంత్య్రం వచ్చేసరికి ఏమీ లేని దేశం.. 78 ఏళ్లలోనే ప్రపంచంలోనే ఆర్థికంగా నాలుగోస్థానంలో నిలిచింది. ప్రతీ భారతీయుడికి తక్కువ ధరలో, పూర్తి నాణ్యతతో వైద్యం అందించాలి. నాణ్యతతో కూడిన ఉచిత వైద్యం, విద్యను 2047 నాటికి అందించాలి. అందుకు ప్రస్తుత ప్రభుత్వాలు కృషి చేయాలి.

– బి.దశరథ్, బీబీఏ సెకండియర్, మంచిర్యాల

టెక్నాలజీ, విద్య అందాలి



స్వాతంత్య్రం సాధించిన 78 ఏళ్లలోనే దేశ జీడీపీతోపాటు ఎంతగానో అభివృద్ధి సాధించింది. మరో 22 ఏళ్లలో దేశం ప్రపంచంలోనే గొప్పదేశంగా మారేందుకు అవకాశాలున్నాయి. టెక్నాలజీ, ప్రతీ ఒక్కరికి ఉచితంగా విద్య అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి. ఎంతోమంది విద్యావంతులు తయారై దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తారు.

– సిహెచ్.కౌశిక్, ఎంఎస్‌టీడీఎస్ ఫస్టియర్, మంచిర్యాల

అభివృద్ధి సాధించాలి



దేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మరింత అభివృద్ధి సాధించేందుకు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. విద్య, ఉద్యోగం, వైద్యం, కోర్టుల్లో జరిగే న్యాయం సత్వరంగా అందడంతోపాటు మారుతున్న కాలానుగుణంగా ప్రభుత్వం ఆలోచించాలి. స్కిల్ డెవలప్‌మెంట్ అనేది చిన్ననాటి నుంచే విద్యతోపాటు అందించాలి.

– ఎస్.భూమిక, ఎంఎస్‌టీసీఎస్, ఫస్టియర్, మంచిర్యాల

దేశాభివృద్ధికి పోటీపడాలి



అభివృద్ధి అంటే ఎన్నో రకాల శాఖలు ఉన్నాయి. స్వాతంత్య్రం వచ్చినప్పుడు ఏమీ లేని స్థాయి నుంచి నేడు అన్ని రకాలుగా ఎకానమీలో ప్రపంచంలోనే ఒక మంచి స్థానాన్ని పొందాం. ఐటీ, హెల్త్ సెక్టార్‌పరంగా ప్రపంచంతో పోటీపడాలి. వందేళ్ల స్వాతంత్య్రం నాటికి దేశం పూర్తి స్థాయిలో అభివృద్ధి అందిస్తుందన్న నమ్మకం ఉంది. ఇందుకు దేశంలోని యువతతోనే సాధ్యం. ఏ.శివాజ్ఞరాజు, బీబీఏ సెకండియర్, మంచిర్యాల

కరప్షన్ లేకుండా చేస్తేనే..



స్వాతంత్య్రం వచ్చి మరో 22ఏళ్లలో వందేళ్లను పూర్తి చేసుకోబోతున్నాం. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నా కరప్షన్ విషయంలో మాత్రం ఇంకా బయట పడలేకపోతున్నాం. అన్ని రంగాల్లో కరప్షన్ పెరిగిపోయింది. దీనిని నియంత్రించకపోతే ఎంతో నైపుణ్యం ఉన్న యువతకు అవకాశాలు లేకుండా పోతాయి. దేశాభివృద్ధికి ట్యాక్స్ అవసరమే కానీ, మధ్యతరగతి ప్రజలపై ట్యాక్స్‌ల భారం తగ్గించాలి.

– సిహెచ్.కేజియా, ఎంఎస్‌టీసీఎస్ ఫస్టియర్, మంచిర్యాల

ఉచితంగా ఉన్నత విద్య అందించాలి



దేశం విద్యపరంగా అంతగా అభివృద్ధి చెందలేదు. స్వలాభం కోసమే రాజకీయ నాయకులు పనిచేయకుండా, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ఎన్నికలతో సంబంధం లేకుండా ఇవ్వాలి. మారుమూల ప్రాంతాలకు విద్య, వైద్యం అందించేలా ప్రభుత్వాలు కృషి చేయడంతోపాటు ఉన్నత చదవులను ఉచితంగా అందిస్తేనే పేదలకు లబ్ధి చేకూరి, పేదల్లోనూ మెరికల్లాంటి విద్యార్థులు దేశానికి లభించి, దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తారు.

– ఆర్.వైభవ్‌గౌడ్, ఎంఎస్‌టీడీఎస్ ఫస్టియర్, మంచిర్యాల

'గిరి' ప్రాంతాలు అభివృద్ధి చెందాలి



దేశం అభివృద్ధి అనేది గ్రామీణ ప్రాంతం నుంచి మొదలవ్వాలి. ఇప్పటికీ గిరిజన ప్రాంతాలతోపాటు మారుమూల ప్రాంత ప్రజలకు ప్రభుత్వం నుంచి సమాచారం చేరలేకపోతోంది. వారిని ఓటరుగా మాత్రమే చూస్తున్నారు తప్ప సదుపాయాలు కల్పించడం లేదు. వాటిని కూడా దేశాభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తేనే స్వాతంత్య్రం వచ్చి వందేళ్లు పూర్తి చేసుకునేలోపు దేశం అభివృద్ధి చెందినట్లు.

– ఎం.ప్రత్యూష, బీజెడ్‌సీఎస్ ఫైనలియర్, పెద్దంపేట్(దొనబండ)

పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు

- కలెక్టర్ కుమార్ దీపక్
- ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం హాజీపూర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్ రిజిస్టర్లు, పరిసరాలు పరిశీలించి రోగులతో మాట్లాడారు. కర్ణమామిడిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజన పనితీరును పరిశీలించారు. కేజీబీవీ ప్రత్యేకాధికారి స్వప్న, పీహెచ్‌సీ వైద్యాధికారి లహరి పాల్గొన్నారు.



చెరువులో బోటుపై కలెక్టర్ కుమార్ దీపక్

వార్షిక పాస్ సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జాతీయ రహదారుల సంస్థ కల్పించిన వార్షిక పాస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జాతీయ రహదారుల సంస్థ మంచిర్యాల పీఐయూ డిప్యూటీ మేనేజర్ హర్షకుమార్ గుప్తా, అధికారులతో కలిసి వార్షిక పాస్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడతూ దేశంలోని జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ హైవేలపై వర్తించేలా ఈ నెల 15 నుంచి అమల్లోకి రానుందని తెలిపారు.

ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధం

మంచిర్యాలటౌన్: ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్ చెరువును డీసీపీ ఏ.భాస్కర్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్ష సూచన నేపథ్యంలో ప్రజల రక్షణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 90 మంది సభ్యులతో మూడు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, శిక్షణ పొందిన పోలీసులు, గజఈతగాళ్లు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

రాంనగర్ వాగుపై కొత్త బ్రిడ్జి నిర్మాణం



కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: వర్షాకాలంలో వరద నీరు ముంచెత్తి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న రాంనగర్ వాగుపై కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపడుతామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. గురువారం పట్టణంలోని రాంనగర్ వాగు వద్దకు వెళ్లి పరిసరాలను పరిశీలించారు. వాగుపై సరైన వంతెన లేకపోవడంతో వరద నీరు ఇళ్లలోకి వస్తోందని, ఏటా తమకు వరద కష్టాలు తప్పడం లేదని స్థానికులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే ఏమాత్రం జాప్యం చేయకుండా కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు కాంట్రాక్టర్‌తో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌ను ఆదేశించారు. చైన్ మిషన్ ద్వారా వాగులో పూడిక తీయించి వరద ముప్పును నివారించాలని సూచించారు. రాంనగర్ బస్తీ వాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఎల్లంపల్లి'లో పెరిగిన నీటిమట్టం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట వద్ద ఉన్న ఎల్లంపల్లి(శ్రీపాద సాగర్) ప్రాజెక్ట్ నీటిమట్టం మూడు టీఎంసీల మేర పెరిగింది. ఎగువ ప్రాంతాలు, కడెం ప్రాజెక్ట్ నుంచి వస్తున్న వరద నీటితో నీటిమట్టం పెరుగుతూ వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను గురువారం 15.750 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. కడెం ప్రాజెక్ట్ నుంచి 5,775 క్యూసెక్కులు, ఎగువ ప్రాంతాల నుంచి 4,100 క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 277 క్యూసెక్కులు, నంది పంప్‌హౌజ్‌కు 9,500 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు.

దొంగ ఓట్లతో గెలిచేందుకు బీజేపీ ప్రయత్నం

- డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ
- మంచిర్యాలలో కొవ్వొత్తుల ర్యాలీ

మంచిర్యాలటౌన్: దొంగ ఓట్లతో ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ విమర్శించారు. దొంగ ఓట్లను ఆధారాలతో సహా బయటపెట్టినా ఎన్నికల సంఘం, బీజేపీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఓట్ చోర్.. గద్దె చోడ్(ఓట్ల దొంగలు గద్దె దిగండి) ఉద్యమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంచిర్యాల నగరంలోని వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా నుంచి ఐబీ చౌరస్తా మీదుగా గురువారం సాయంత్రం మాస్ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు సురేఖ మట్లాడుతూ ఒకే ఇంట్లో పదుల సంఖ్యలో ఓటర్లు ఉండడం, ఓటర్లుగా ఉన్నవారిని మృతిచెందినట్లుగా చిత్రీకరించడం వంటివి బీజేపీ చేపట్టి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రజలందరూ చైతన్యవంతులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీలో డీసీసీ అధ్యక్షురాలు కే.సురేఖ, నాయకులు

క్లుప్తంగా

ఒకరి మృతికి కారణమైన ఇద్దరికి ఐదేళ్ల జైలు

భీమిని: కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి గ్రామ పంచాయతీలోని దాంపూర్ గ్రామ శివారులో వన్యప్రాణులను వేటాడేందుకు అమర్చిన విద్యుత్‌వైర్లు తాకి ఒకరి మృతికి కారణమైన ఇద్దరికి ఐదేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ మంచిర్యాల జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస నాయక్ గురువారం తీర్పునిచ్చినట్లు కన్నెపల్లి ఎస్సై భాస్కర్‌రావు తెలిపారు. 2021లో దాంపూర్ గ్రామానికి చెందిన అర్కం రమేశ్, తలండి బాపు బైండింగ్ వైరుతో విద్యుత్ తీగలు అమర్చగా అదే గ్రామానికి చెందిన మేకల శంకర్ వాటిని తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య మేకల లక్ష్మి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అసిస్టెంట్ పీపీ రాజ్‌కుమార్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

గంజాయి కేసులో ఒకరి రిమాండ్

నెన్నెల: గంజాయి కేసులో ఒకరిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. బొప్పారం అటవీ ప్రాంతంలో గంజాయి సేవిస్తున్నట్లు అందిన సమాచారంతో బుధవారం దాడి చేసి మంచిర్యాలలోని గద్దెరేగడికి చెందిన పాల్తెపు ప్రణయ్‌ను పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 1.50 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో నెన్నెల మండలం గన్‌పూర్ గ్రామానికి చెందిన పోతరాజుల అకాష్, గొల్లపల్లికి చెందిన సల్లూరి పెద్రు పరారీలో ఉన్నట్లు వివరించారు.

పంటలను పరిశీలించిన సబ్ కలెక్టర్

భీమిని: భారీ వర్షాలకు ముంపునకు గురైన పంటలను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ గురువారం పరిశీలించారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. పంట పొలాల్లో చేరిన నీటిని సాధ్యమైనంత వరకు త్వరగా బయటకు పంపించాలని సూచించారు. రాబోయే రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. పంటల నష్టం అంచనావేసి పంపించాలని అధికారులను ఆదేశించారు. చిన్నతిమ్మపూర్, తంగేళ్లపల్లి గ్రామాల మధ్యలో వంతెన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్లు బికార్ణ దాస్, శ్రవణ్‌కుమార్, ఏఈవోలు పాల్గొన్నారు.

నేడు బెల్లంపల్లిలో ఉమ్మడి జిల్లా మహాసభ

బెల్లంపల్లి: తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ (టీహెచ్‌డబ్ల్యూ) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహాసభను శుక్రవారం బెల్లంపల్లిలోని అగర్వాల్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గెల్లి రాజలింగు తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంటి సామ్రాజ్యం ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. 21 విభాగాల్లో పని చేస్తున్న హమాలీలు పాల్గొంటారని, సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ తయారు చేయనున్నట్లు తెలిపారు.

మద్యానికి దూరం.. చారిగాం

అదో మారుమూల కుగ్రామం. ఆ గ్రామంలో అందరి జీవనాధారం వ్యవసాయమే. ప్రతీరోజు ఉదయాన్నే నిద్రలేచి ఆహ్లాదకరమైన వాతావరణంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. మహాత్మాగాంధీ సూచనలు నమ్మిన కాగజ్‌నగర్ మండలంలోని చారిగాం గ్రామస్తులు మద్యపాన నిషేధాన్ని పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.


చారిగాం గ్రామం

- మూడున్నర దశాబ్దాల క్రితం పెద్దల తీర్మానం
- ఇప్పటికీ కట్టుబాటు పాటిస్తున్న గ్రామం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో చారిగాం గ్రామం ఉంది. ఈ గ్రామంలో 234 మంది జనాభా, 112 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారంతా మద్యం నిషేధానికి కట్టుబడి ఉంటున్నారు. గ్రామంలో గుడుంబా తయారీ, బెల్టుషాపుల ఏర్పాటు చేయవద్దని మూడున్నర దశాబ్దాల క్రితమే పెద్దలు తీర్మానించారు. ఇప్పటికీ అవే ఆచారాలను పాటిస్తున్నారు. గ్రామంలో అన్నీ వ్యవసాయ కుటుంబాలే. ప్రధానంగా కూరగాయలు సాగుచేసి పట్టణంలోని మార్కెట్‌లో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. 35 ఏళ్లుగా గ్రామస్తులు మద్యపాన నిషేధం పాటిస్తున్నారు. స్థానిక యువత బయట తాగినట్లు తెలిస్తే ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకెళ్లి వారిచే మాలధారణ చేయిస్తున్నారు. మరోసారి మద్యం జోలికి వెళ్లకుండా వారికి అవగాహన కల్పిస్తున్నారు. గ్రామంలో అందరూ కలిసిమెలిసి ఉంటారు. ఎలాంటి గొడవలు, అల్లర్లకు తావులేకుండా మంచి నడవడికతో ఉంటున్నారు.

ఆచారం ఇప్పటికీ కొనసాగుతోంది



మా తాతల కాలం నుంచి గ్రామంలో ఎవరూ మద్యం సేవించరు. అదే ఆచారం ఇప్పటి వరకూ కొనసాగుతోంది. గ్రామంలో అందరం కలిసి మెలిసి ఉంటాం. ఏ సమస్య వచ్చినా ఇక్కడే అందరం కలిసి పరిష్కరించుకుంటాం. ఆంజనేయ స్వామి గుడిలో పూజలు నిర్వహిస్తాం. అందరం కలిసి పండుగలు ఆనందంగా జరుపుకుంటాం.

– మొర్ల పోచయ్య, చారిగాం

స్నేహభావంతో ఉంటాం



గ్రామంలోని యువకులమంతా కలిసి మెలిసి స్నేహభావంతో ఉంటాం. గ్రామంలో ఏమైనా సమస్య ఉంటే యువకులమంతా ఒకేచోట చేరి పరిష్కరించుకుంటాం. గ్రామంలో ఎవరూ మద్యం సేవించరు. బెల్టుషాపులు పెట్టరు. ఇదే ఆచారాన్ని అందరం పాటిస్తాం.

– మొర్ల శంకర్, చారిగాం

స్వచ్ఛతలో మేటి 'దేవునిగూడ'


దేవునిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం

- రెండుసార్లు ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక
- కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

జన్నారం: దేశానికి పల్లెలే పట్టుకొమ్మలని, గ్రామాలు పచ్చదనంతో ఉంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందని చెబుతారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతే ధ్యేయంగా ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా పరిశుభ్రం, పచ్చదనంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయడంలో ముందుండడమే కాకుండా ఉత్తమ గ్రామ పంచాయతీగా రెండుసార్లు ఎంపికై ంది. సర్పంచ్, కార్యదర్శులు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. అదే జన్నారం మండలంలోని దేవునిగూడ.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

దేవునిగూడ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ గుర్రం శిరీష, కార్యదర్శి సరిత ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటుగా హరితహారం, పరిశుభ్రత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించారు. డ్రెయినేజీలు శుభ్రం చేయించడం, మురుగు నీరు రోడ్లపై పారకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రోడ్లుకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టారు. పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటిక, డంపింగ్ యార్డుల నిర్వహణ సక్రమంగా ఉంచారు. పలుమార్లు ఈ గ్రామాన్ని సందర్శించిన ఉన్నతాధికారులు పంచాయతీ పాలకవర్గం పనితీరుపై ప్రశంసలు కురిపించారు. ఇందులో భాగంగా 2022 ఆగస్టు 15న అప్పటి సర్పంచ్ శిరీష, కార్యదర్శి సరిత కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకున్నారు.

అధిక తేమతో పంటలకు చేటు


కోటపల్లి మండలంలో పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

- తక్షణమే జాగ్రత్తలు పాటిస్తే మేలు
- బానోతు ప్రసాద్, ఏడీఏ, చెన్నూర్

చెన్నూర్‌రూరల్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పంటచేలల్లో నీరు నిలిచింది. నీరు ఎక్కువైతే తేమ ఏర్పడి పంటలకు నష్టం వాటిల్లనుంది. అధిక తేమతో పంటలు నష్టపోకుండా ఉండాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెన్నూర్ ఏడీఏ బానోతు ప్రసాద్ సూచిస్తున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే... వర్షాలకు పత్తి చేనులో నీరు నిలిస్తే వెంటనే కాలువలు తీసి నీటిని బయటకు పంపించాలి. వర్షాలు తగ్గిన వెంటనే భూమిలో తేమను తగ్గించు కోవడానికి అంతర సేద్యం చేయాలి. బురద పదనులో ఎకరాకు 25 కిలోల యూరియా 10 కిలోల పొటాష్‌ని చ్చే ఎరువులను వేసుకోవాలి. అలాగే ఎకరానికి సీఓసీ 3 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఒకరోజు తర్వాత కిలో స్వర్ణపాల్‌ను 150 లీటర్ల నీటికి కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. పంటను వేరుకుళ్లు తెగులు ఆశిస్తే 3 గ్రాముల ఆక్సిక్లోరైడ్ లేదా ఒక గ్రాము కార్బండిజమ్‌ను లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లలో తడపాలి.

మొక్కజొన్న

అధిక తేమను తట్టుకోలేదు. సాధ్యమైనంత త్వరగా అంతరకృషి చేసుకోవాలి. ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువును మొక్కల మొదళ్ల దగ్గర వేసుకోవాలి. కాండం తొలిచే పురుగు ఉంటే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 3 కిలోలు ఆకు సుడుల్లో వేయాలి. పెసర, మినుము పైర్లకు అధిక తేమతో పేనుబంక, లద్దె పురుగు ఆశించే అవకాశం ఉంది. ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మిరప పంట

మిరప చేనులో నీరు నిలిస్తే వెంటనే నీటిని కాలువల ద్వారా తొలగించాలి. నారుకుళ్లు తెగులు ఆశిస్తే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా రెండు గ్రాముల రిడోమిల్ లీటరు నీటికి కలిపి వారంలో రెండు నుంచి మూడుసార్లు పిచికారీ చేయాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే అధిక తేమ నుంచి పంటలను కాపాడుకోవచ్చు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముల్కల్ల గ్రామ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. కోటపల్లి మండలం దేవులవాడకు చెందిన నిట్టూరి శశిపాల్ (36) గురువారం ఉదయం ముల్కల్ల శివారులో నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని తండ్రి లస్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జిల్లా క్రికెట్ అసోసియేషన్‌ను ప్రక్షాళన చేయాలి


మంచిర్యాలటౌన్: జిల్లా క్రికెట్ అసోసియేషన్‌ను ప్రక్షాళన చేయాలని, హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అక్రమాలపై విచారణ చేపట్టాలని ఓల్డ్ మంచిర్యాల క్రికెట్ క్లబ్(ఓఎంసీసీ) అధ్యక్షుడు బొలిశెట్టి కిషన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శివాజీ మైదానంలో గురు క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం అండర్–17 క్రికెట్ టోర్నమెంట్ పోటీలను కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గురు అకాడమీ నిర్వాహకులు దుర్గాప్రసాద్, ఎంఏ విజయ్, వివేక్, తూముల ప్రభాకర్, ఆమ్రోస్, ఎడ్ల మల్లేశ్, ఎలుక శ్రీనివాస్, రమేశ్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం క్రికెట్ క్రీడాకారుల కోసం రూ.20 వేల మ్యాట్‌ను కిషన్, ప్రభాకర్ అందించారు.

ఎరువుల కోసం బారులు


ఎరువుల కోసం బారులు తీరిన రైతులు

చెన్నూర్: చెన్నూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనం వద్ద ఎరువుల కోసం రైతులు బారులు తీరారు. గురువారం ఎరువులు పంపిణీ చేస్తున్నారనే సమాచారం మేరకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వరుసలో ఎక్కువ సమయం ఉండలేక తమ వంతుగా చెప్పులు ఉంచారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులకు సక్రమంగా ఎరువులు పంపిణీ జరిగేందుకు బందోబస్తు నిర్వహించారు.

యూరియా కోసం రైతుల ఆందోళన


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సురేఖ

భీమిని: యూరియా సక్రమంగా పంపిణీ చేయడం లేదని మండలంలోని వెంకటాపూర్‌లో జై భీమ్ పరస్పర సహాయక సహకార మార్కెటింగ్ సంఘం ఎదుట రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. రైతులు మాట్లాడుతూ ఈ కేంద్రం నుంచి ఇప్పటివరకు ఒక లోడు మాత్రమే పంపిణీ చేశారని తెలిపారు. నిర్వాహకులు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతూ రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఏడీఏ సురేఖ, ఎస్సై భాస్కర్‌రావు రైతులతో మాట్లాడగా ఆందోళన విరమించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అమ్మకాలు చేపట్టాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని ఏడీఏ సురేఖ తెలిపారు. భీమిని ఏవో యమునాదుర్గా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శిశువు మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి


ధర్నా చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు

బెల్లంపల్లి: వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందాడని ఆరోపిస్తూ గురువారం బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఎదుట బాధిత కుటుంబ సభ్యులు ధర్నా నిర్వహించారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలానికి చెందిన గర్భిణి సువర్ణకు పురిటి నొప్పులు రావడంతో ఆమె భర్త కరణ్ బుధవారం బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చాడు. పరీక్షించిన వైద్యులు నార్మల్ డెలివరీ చేస్తామని చెప్పి చేర్చుకున్నారు. అదే రోజురాత్రి మగశిశువుకు జన్మనిచ్చింది. పుట్టిన బిడ్డ చనిపోయినట్లు తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందాడని ఆస్పత్రి ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. మంచిర్యాలకు రెఫర్ చేయకుండా వైద్యులు అశ్రద్ధ చేసి తమ బిడ్డ మృతి చెందడానికి కారకులయ్యారని ఆరోపించారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులైన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఆస్పత్రి వైద్యులను వివరణ కోరగా మగశిశువు స్టిల్‌బర్త్‌తో పుట్టాడని, తల్లిగర్భంలో ఉన్నప్పుడు మలం తినడంతో మృతి చెందినట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న యూరియా పట్టివేత


పట్టుబడిన వాహనంతో సీఐ, ఏవో, ఎస్సై

కోటపల్లి: బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న యూరియాను గురువారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ బన్సీలాల్ వివరాలు వెల్లడించారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ నిర్వహిస్తుండగా బొలెరోలో ఎలాంటి ఆధారాలు లేకుండా మహారాష్ట్రకు తరలిస్తున్న 62 బస్తాల యూరియా పట్టుబడడంతో వ్యవసాయాధికారి సాయికృష్ణారెడ్డికి సమాచారం అందించామన్నారు. అతను వచ్చి యూరియాను పరిశీలించి అక్రమంగా తరలిస్తున్నారని చెప్పడంతో వాహనాన్ని కోటపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామన్నారు. చెన్నూర్ పట్టణంలోని అస్నాద్ రోడ్డులో గల శ్రీ లక్ష్మీవెంకటేశ్వర ఫెర్టిలైజర్ షాపు నుంచి యూరియా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించి వాహన డ్రైవర్‌పై రాజమల్లు, షాపు యజమాని బాపురెడ్డిపై ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1983 చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జీఎం కార్యాలయం ఎదుట ఐఎన్టీయూసీ ధర్నా

శ్రీరాంపూర్: కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు కాంపెల్లి సమ్మయ్య, జెట్టి శంకర్‌రావు మాట్లాడుతూ జూలై 31న నిర్వహించిన మెడికల్ బోర్డు నిర్ణయాలను రద్దు చేసి తిరిగి మెడికల్ బోర్డు నిర్వహించాలని అన్నారు. కంపెనీ లాభాలను ప్రకటించి అందులో నుంచి 35శాతం వాటా కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏరియా జీఎం ఎం.శ్రీనివాసును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు కలవేన శ్యామ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, చాట్ల అశోక్, వెంకటస్వామి, శీలం చిన్నయ్య, మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, జీవన్ జోయల్, మనోజ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సొసైటీ పాలకవర్గాల గడువు పొడిగింపు

కైలాస్‌నగర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్)ల పాలకవర్గాల గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. గురువారంతో వీటి కాల పరిమితి ముగియగా మరో ఆరు నెలల పాటు సొసైటీ, డీసీసీబీ చైర్మన్ల పదవీకాలం పొడిగిస్తూ రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల ప్రభుత్వ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై సొసైటీ చైర్మన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ అడ్డి భోజారెడ్డి గురువారం సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో అధికారుల నిరసన

శ్రీరాంపూర్: పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే(పీఆర్‌పీ) డబ్బులు చెల్లించాలని సింగరేణి అధికారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం అధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి జీఎం కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అధికారులు మాట్లాడుతూ కోలిండియా పరిధిలో 2022–23, 2023–24 సంవత్సరానికి సంబంధించిన పీఆర్‌పీ చెల్లించారని తెలిపారు. సింగరేణిలో మాత్రం చెల్లించడం లేదన్నారు. అనంతరం ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మహేశ్, అపెక్స్ సీనియర్ ఉపాధ్యక్షుడు ఏవీ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ జనరల్ సెక్రటరీగా అశోక్

శ్రీరాంపూర్: సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్(ఐఎన్టీయూసీ) సెక్రెటరీ జనరల్‌గా చాట్ల అశోక్‌ను నియమించారు. ఈ మేరకు గురువారం ఆ యూనియన్ సెక్రెటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. జీఎం కార్యాలయంలో అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న చాట్ల అశోక్ యూనియన్‌లో క్రియాశీలకంగా పని చేయడంతో జనరల్ సెక్రెటరీగా నియమించారు.

కాంగ్రెస్‌లోకి మాజీ కౌన్సిలర్లు

చెన్నూర్: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు చెక్ పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహం రచిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో హస్తగతం చేసుకునేందుకు బీఆర్‌ఎస్, బీజేపీలో కీలకంగా ఉన్న నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు రంగం సిద్ధమైంది. చెన్నూర్‌కు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి రహస్య సమావేశం నిర్వహించి పార్టీలోకి ఆహ్వానించినట్లు సమాచారం. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో కొత్త వారిని చేర్చుకునేదిలేదని అల్టిమేటం జారీ చేసిన కాంగ్రెస్ పెద్దలు నేడు వివిధ పార్టీల నాయకులను ఆహ్వానిస్తున్నట్లు తెలిసింది. చెన్నూర్ మున్సిపాలిటీలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పావులు కదుపుతున్నట్లు తెలిసింది. మరో రెండ్రోజుల్లో ఆయా పార్టీలకు చెందిన ఐదుగురు మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌తోపాటు వారి అనుచరగణం మంత్రి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారని తెలిసింది.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

మంచిర్యాలఅగ్రికల్చర్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అదనపు కలెక్టర్ పి.చంద్రయ్యకు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ వేతనాలు పెంచడంతోపాటు ఫేస్ క్యాప్చర్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కలిందర్‌అలీఖాన్, సర్వతి, రమా, సురేఖ, అరుణ, తిరుమల, పద్మ, శారద, శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపై త్రివర్ణ పతాకం ఆవిష్కరించాలి

చెన్నూర్: ప్రతి ఒక్కరూ ఇళ్లపై త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. హర్ ఘర్ తిరంగలో భాగంగా గురువారం చెన్నూర్ పట్టణంలోని జలాల్ పెట్రోల్ బంక్ నుంచి ప్రధాన వీధుల్లో జాతీయ పతాకాలతో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ఆపరేషన్ సింధూర్ విజయవంతమైందని తెలిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి వెంకటేశ్వర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బత్తుల సమ్మయ్య, కేవీఎం శ్రీనివాస్, తిరంగా ర్యాలీ కన్వీనర్ శివకృష్ణ, మంత్రి రామయ్య పాల్గొన్నారు.